


# నేను మనిషిని!

పి.ఎస్. నారాయణ

"మధు ఎక్స్‌పైర్‌డ్ ... స్టార్ట్స్ యిమీడియట్లీ— సుజాత!"

రాజుకు ఏఁవీ అర్థంకాలేదు!

* * *

'రాజూ! సాయంత్రం టాంక్‌బండ్ మీదకు... ఐదు గంటలకు...పచ్చిమిరప కాయల బండిదగ్గర!' చీటీ చేతిగుప్పిటలో కుక్కి పరుగెత్తాడు సుజాత చిన్న తమ్ముడు గోపి.

సుజాతకు ఏఁవొచ్చినా ఓపిక పట్ట లేదు. ఏఁవయి వుంటుందా విషయం?

తమ వివాహం సంగతా? గూడ లెగరే శాడు— ఆల్ రైట్!

అప్పటికే ఉల్లి పాయలు తురిమి, నిమ్మరసం పిండిన ఒక బజ్జీని లాగేశాడు రాజు. సూర్యుడు హుస్సేన్ సాగర్‌లో మునిగి పోతున్న వేళ. సుజాత రిక్షా దిగింది. గాగుల్స్ తీసి పచ్చి మిరపకాయ బజ్జీల బండికేసి నడుస్తూ "రాజూ! పద" అన్నది.

"నేనొక్కటే తిన్నాను!''

"అయితే పొట్లం కట్టించు!"

"నీకు నిమ్మ కాయ పిండించ మంటావా?''

''యస్ ప్లీజ్!''

పేవ్‌మెంటు మీద యిద్దరూ పక్క పక్కన నడుస్తున్నారు.

''నాకు సహాయం చేయాలి రాజూ!"

"ప్రాణం ఇవ్వనా?"

సుజాత సూటిగా రాజు ముఖంలోకి చూచింది.

"నాకు తెలుసు రాజూ! మనం అలా పెరిగాం.'' అన్నది. ముఖం పక్కకు తిప్పుకుంటూ. "ప్రాణం యివ్వనక్కర లేదు... మాట యివ్వచాలు!" అన్నది.

"ఏమిటది?''

''మనకు పరీక్షలయి, మన రిజల్ట్సు వచ్చేటంతవరకూ మన వివాహం జరగ బోదనే విషయం ఎవ్వరికీ చెప్పవద్దు!"

అధాట్టుగా తలెత్తి రాజు,

''అదేమిటి?"

జాలిగా రాజు ముఖంలోకి చూచింది సుజాత.

"మన వివాహం జరగదు రాజూ!"

"ఎందుకని సుజాతా?"

"రాజూ! నన్ను క్షమించు!"

"ఏమిటి సుజా! ఏమైంది?"

అన్నాడు ఆమె ముఖంలోకి చూస్తూ ఆత్రంగా.

అతడికి అంతా అయోమయంగా వున్నది.

క్రితం క్షణంవరకూ తనకు మరో ప్రాణం అవుతుందనుకుంటున్న సుజాత— ఈక్షణం నుండి తనకేమీ కాదు అనే నిజం అతడికి చాలా చేదుగా వున్నది.

"నన్ను అర్థం చేసుకుంటావు గదూ?"

పేలవంగా నవ్వాడు.

"నీకెందుకు వచ్చిందా భయం... నీకిష్టం లేకుండా నిన్ను వివాహం చేసుకోవాలని కోరుకుంటానను కుంటు న్నావా?"

"అదిగాదు, రాజూ!"

"మరేమిటి..." మనస్సు నిబ్బరించు కుంటున్నట్లుగా ఒక్క క్షణం ఆగాడు. "మనయిద్దరం చిన్నప్పటినుండీ పక్క పక్క యిళ్ళలో వున్నా ఒక్క ఇంట్లో పెరిగాం...అందరూ మనం భార్యాభర్తల మవుతాం అనుకున్నారు... యిప్పుడూ మా వాళ్ళు దూరాన వున్నా, నేను

యిక్కడ వుంటున్నానంటే అదే ఊహలోవున్నారు... అలాగే చూస్తూ వున్నారుగూడామనని...కాని మనిద్దరిలో ఎవరికి ఇష్టం లేకపోయినా, వాళ్ళ కోసరం మనం ఒకటి కాలేంగదా . . . మనకు వయస్సు వచ్చింది. మనకూ ఆలోచించుకునే శక్తి వున్నది. మనకూ ఆలోచించుకునేందుకు మనస్సు ఇచ్చాడు భగవంతుడు. . . మనకు మంచిదను కున్న దాన్నే మనం చేస్తాం... అంతే గాని, మావాళ్ళు, మీవాళ్ళు పట్టు పట్టి నంత మాత్రాన మన వివాహం జరగ బోదు... గుర్తుంచుకో!"

"కోపమొచ్చింది గదూ!" భయం భయంగా రాజు మొఖంలోకి చూసింది.

రాజు నవ్వాడు. " ఛీ! పిచ్చిదానా.. ఇన్నాళ్ళ బట్టి నన్ను అర్థం చేసుకున్నది ఇంతేనన్న మాట...!" ఆప్యాయంగా సుజాత మొఖంలోకి చూచాడు.

"థాంక్యూ రాజూ!"

రాజుకు సుజాత తన భార్య కావటం లేదనేది బాధకలిగించేదైనా, అమె కిష్టం లేనప్పుడు పట్టు పట్టేటంత మూర్ఖుడు కాడు అతడు.

"నేనూ మధూ వివాహం చేసుకోబో తున్నాం!"

''రియల్లీ!"

"నిజంరాజూ!...అందుకేనీసహాయం కావాలంటున్నాను!"

"ఏం చేయమంటావో చెప్పు?"

సుజాతకు కళ్ళు తడిసినయి.

గొంతు బొంగురు పోయింది.

''నీవు దేవుడివి రాజూ!"

"యూ ఆర్ సిల్లీ..." అన్నాడు పెదాలు బిగించి.

"అంతే గాదు: ఒట్టి ఫూల్ వి గూడా... నీ మనస్సులో మాట చెప్ప టానికి ఇంత బాధ పడాలా?" అన్నాడు ఆమె మొఖంలోకి చూస్తూ.

"పరీక్షలు ఎలాగూ ఇంకా ఐదారు నెలల్లో అయి పోతాయి... తరువాత రెండు నెలల్లో రిజల్ట్సు... మధుకి ఎమ్మే అయిపోతుంది... రిజల్ట్సు రాంగానే ఏదో ఒక జాబ్ దొరకక్క పోదు... అతనిని నేను చేసుకుంటే మాయింట్లో నాస్థానం ఎంతో నాకు తెలుసు— అతనికా ఆ చదువుతప్ప నయాపైస డబ్బులేదు... మా వివాహం అతడికి ఓ ఉద్యోగం వచ్చింతరువాత అయితే మాకేం ప్రాబ్లంస్ వుండవు... అందుకనే అప్పటిదాకా మన వివాహ విషయం ఎటూ తేల్చబోకు... ఇప్పుడే కాదనుకున్నామా రేపటినుంచే మానాన్న పెళ్ళి కొడుకులను క్యూలో మా వాకిట్లో నిలబెడతాడు... వాళ్ళతో నేను చావాల్సి వస్తుంది... ఈ కాస్తసాయం చేశావంటే జీవితాంతం..."

"మోస్ట్ హార్టిలీ...డోన్ట్‌వర్రీ..."

"బహుత్ షుక్రియా, రాజూ!"

''కోయీ బాత్ నహీ, సుజా"

* * *

గడిచి పోయిన రోజులు జీవితంలో తీయనివి అయినంత మాత్రాన గడప బోయేవీ అలాగే వుండాలని ఏ మున్నది?—అయినా భవిష్యత్తు ఎవరు చెప్పగలరు?

అసలు ఎందుకిలా జరిగింది?

ఎలా జరిగింది?

యాక్సిడెంటా?

తను సెలవలకు యింటికి బయిల్దేరితే యిద్దరూ స్టేషన్‌కు వచ్చారు.

మధు... సుజాత...

రైలు వేగం పెరుగుతున్నా, వాళ్ళు క్షణక్షణానికీ దూరమయి పోతున్నా, చేతులూపుతున్న వాళ్ళని చూస్తున్నాడు తను.

అందమైన జంట...

ఉఁహూ...

మధు స్థలంలో తను...

సుజాత తన ప్రక్కన...

తల వాలి పోయింది!...

—కానీ, సుజాత ఆనందం తన ఆనందం కాదా?...

సుజాత మనస్సు తెలుసుకొని గూడా ఎలా నిర్బంధించగలడు?

అందుకే అంగీకరించాడు.

అంతేగాదు—ఈ విషయంలో దుఃఖ పడటంలోగాని, కోపగించు కోవటంలో గాని ఫలితంలేదు!

వడి వడిగా పెట్టె సర్దేశాడు.

తండ్రికి చెప్పాడు— 'ఒక ఫ్రెండు పోయాడు— నాలుగు రోజుల్లో వస్తాను!' అని.

రిక్షా ఎక్కాడు.

సుజాతకెంతదెబ్బ యిది?

—అవును, సుజాత ముందు జీవితం...?

ఓ భయంకరమైన పెనుభూతం మేను కంపించేలా మీద వాలింది...

* * *

"రాజూ!..."

"చెప్పమ్మా!"

"టాంక్ బండ్‌కు ప్లీజ్!"

"పచ్చి మెరపకాయ బజ్జీలా?..."

క్షణం అటూ యిటూచూచి చెవిలో గొణి గాడు:

"మధూ రమ్మన్నాడా?"

"ఫో రాజూ!... ఎప్పుడూ ఎగ తాళేనా..."


"అవును పాపం!" గూడ లెగ రేశాడు.

రాజును సుజాత కాదన్నా వాళ్ళ స్నేహానికది కత్తెర కాలేదు.

"నేనూ రాజూ అలా వెళ్ళొస్తాం!" వాకిట్లోనుంచే అరిచింది వంట యింట్లో వున్న తల్లికి వినబడేలా సుజాత.

"సుజాతా, ఒక సారి ఇలా రా!" తల్లి పిలుపుకి లోపలికి వెళ్ళింది.

"...ఏఁవిటేసుజాతా! ఆ ఎగురుడూ తిరుగుడూ... మీరా చిన్న పిల్లలుకారు..




ఆ మూడు ముళ్ళూ పడిందాకా కాస్త ఓపిక పట్టండి... తరువాత వేలు పెట్టి చూపే వాడే వుండడు... కాదూ, అను కోనిదేమైనా జరిగిందా చివరికి అఘో రించాల్సి వచ్చేది నీవే!" నుదురు చిట్లిస్తూ అన్నది.

సుజాత తల్లి మొఖంలోకి భయం భయంగా చూచింది.

"నాకు అనుమానం లేదు తల్లీ... లోకం... లోకం వున్నది చూచావు. అంతను ఇంతగా చెప్పుకుంటుంది... పెళ్ళి కాకుండానే ఇలా మీరు తిరుగు తుంటే నలుగురూ ఏమనుకుంటారు-అని నాబాధ!" అన్నది. ఒక్క క్షణమాగి, "ఎలాగూ బయల్దేరావుగా వెళ్ళు...కాని ఒకటి గుర్తుంచుకో... మనని గురించి నాలుగు విధాలుగా చెప్పుకునేందుకు మరొకరికి అవకాశమివ్వ గూడదు... అంతే నేను చెప్పేది!" అంటూ ఏదో పని వున్నదానిలా అక్కడినుండి వెళ్ళి పోయింది.

గ్రిరున తిరిగి సుజాత బయటకు వచ్చేసింది.

"అమ్మాయిగారూ! టాంక్ బండ్ కు ఎలా వెళ్ళటం...?"

"స్టేషన్‌దాకా నడవడం... ఆపై డబుల్ డెక్కరూ..."

"ముందు సీటుకూడా కావాలా?"

"ఇవ్వాళ నన్ను నవ్వించ వద్దు రాజూ!"

"పోనీ ఏడ్పించ మంటావా?"

"నాకు ఏడుపే వస్తోంది!"

రాజు ఆదుర్దాగా సుజాత మొఖం లోకి చూచాడు.

"ఏఁవైంది,"

"టాంక్‌బండ్ మీదకు వెళ్ళనీయ్... అప్పటివరకూ నన్ను మాట్లాడించబోకు..."

"మధుతో తగవులాటా?"

"ఉఁహూఁ..."

"మరి..."

"మాట్లాడించవద్దన్నానా?" గాగుల్స్ పెట్టేసుకున్నది.

"చిత్తం సార్!"

మౌనం అంతభయంకరమైనది మరొకటిలేదు. సుజాతకయితే ఎలావున్నదో తెలియదుగాని రాజు ఆలోచనలు పరి పరి విధాల—అంతేగాదు—మేనుకంపించేలా వున్నాయి!

సుజాత కేమయింది?

సుజాత ఎందుకు బాధపడుతున్నది!

'మధు— సుజాత— పేచీల్లాంటివి ఏమీ లేవుగదా?'

కాదంటున్నదిగదా?

ఏఁవో...

గూడలెగరేశాడు.

పదే పదే, గాగుల్స్‌లో కప్పివేసుకున్న సుజాత కళ్ళు చూడటానికి తాపత్రయ పడసాగాడు.

సుజాత మాట్లాడటంలేదు. ఉలకటంలేదు. పలకటంలేదు.

స్టేషన్‌దాకా వచ్చి డబుల్ డెక్కరు ఎక్కారు.

"పల్లీలు...?"

"నో ప్లీజ్!"

"ఫ్రంట్‌సీట్?"

"బ్యాక్ సీట్... ఎక్స్ట్రీమ్లీ..."

"క్యాహువా...?"

సుజాత చూపుకి గాగుల్స్ అడ్డం.

రాజు మాట్లాడలేదు. సుజాత బుజం మీద చేయి వేశాడు.

నల్ల కళ్ళద్దాల్లోంచి రాజును చూస్తోంది సుజాత మొఖం పక్కకుతిప్పి. ఏదైనా భయపడాల్సిందేమీ లేదన్నట్లుగా బుజం మీద తట్టాడు.

"పాట్నీ... ఎనీబడీ... రైట్!"

"పారడైజ్ ... నో సీట్స్... రైట్!"

"రాణిగంజ్!"

"కింగ్స్‌వే!"

"డి బీ ఆర్ మిల్స్... టాంక్ బండ్..."

సుజాత బస్సు ఆగకముందే లేచింది. యిద్దరూ దిగారు.

"పచ్చి మెరపకాయ బజ్జీలు?"

"నో ప్లీజ్!"

"నాకుగూడా వద్దు?"

"ఉఁహూఁ..."

"ఇదేదో చాలా సీరియస్‌గానే వున్నదే!" సుజాత నవ్వింది. చాలా పేలవంగా నవ్వినట్లనిపించింది.

"మధూ వస్తాడా?"

"ఊళ్ళోలేడు!"

"ఎక్కడికి వెళ్ళాడు?"

"వాళ్ళ ఊరు... వాళ్ళమ్మకు బాగాలేదని ఉత్తరం వచ్చింది... నెక్స్ట్ వీక్ వస్తాడు!"

"అదా నీబాధ?" ఫక్కున నవ్వాడు.

"నేను పసిపిల్లనుగాను!" బరువుగా అన్నది.

చల్లనిగాలి హుస్సేన్ సాగర్ నీటి మీదగా దొర్లుకు వస్తోంది. ఐస్‌క్రీం బళ్ళు మనుషుల మీదకు దొర్లుకు వస్తున్నాయి. పల్లీల బుట్టలు మనుషుల మీదకు ఎగబడుతున్నయి.

కూర్చుందామంటే ఖాళీ బెంచీ కనబడలేదు.

వాళ్ళిద్దరూ అలా భవిష్యత్తులోకి చొచ్చుకు పోతున్నట్లుగా మౌనంగా ముందుకు నడుస్తున్నారు.

"ఇక్కడ కూర్చుందామా?" ఒక ఖాళీ పచ్చబెంచీ వాళ్ళని ఆహ్వానించింది.

సుజాత తల ఊపింది.

ఇద్దరూ కూర్చున్నారు.

"ఊఁ...చెప్పు!" అన్నాడు దగ్గరకు జరుగుతూ." ఆ గాగుల్స్ తీసేయ్... చూశావా, వెలుతురుగూడా పోతోంది!"

కళ్ళజోడు తీయకుండానే రాజు మొఖంలోకి చూచింది.

"నేను తల్లిని కాబోతున్నాను!"

* * *

రాజు ఉలిక్కిపడ్డాడు— రైలు పెట్టిన కూతకు!

వడి వడిగా కూర్చున్నచోటునుంచి లేచాడు.

సూట్‌కేసుతీసుకొనిఖాళీ పెట్టికోసరం పరుగెత్తాడు. చివరి పెట్టి దొరికింది. మనుష్యులులేరు. ఎవరో ఇద్దరు ముగ్గురు మూలల్నా ముడుచుకు కూర్చున్నారు.

అలా ఒంటరి ప్రయాణం— ఖాళీ పెట్టెలోకష్టమే అనిపించినా ఎక్కి కూర్చున్నాడు.

కళ్ళముందు సుజాత తనవంకే చూస్తూ నిలబడి వుంది.

తను చీవాట్లు పెట్టాడు ఆనాడు

"మీరు చిన్న పిల్లలుకారు తెలుసా!"

"జీవితంతో ఆట"

"మీరు భార్యా భర్తలు అవుతారు సుజీ! నాకు తెలుసు ఆ సంగతి...అందువలన ఇదేమీ పెద్ద తప్పుగాదు... కాని మనమనుకున్న దేమిటి? రిజల్ట్సు వచ్చేటంతవరకూ మన విషయంగూడా ఏదీ చెప్పొద్దన్నావ్... మరి... మీరుచేసిన పనేమిటి?"

"నీ పరీక్షలయినయి, కాదనను... అతడివీ అన్ని పేపర్లూ అయినయి... రిజల్ట్సు రావాలంటే కనీసం రెండునెలలు పడుతుంది ... ఆపైన ఉద్యోగానికి ఒకటి రెండు నెలలు... రెండు నెలల్లో వస్తుందా... ఆరునెలలు పడుతుంది... అప్పుడేంచేస్తావ్... స్నేహితులు ఒక

నెల సహాయం చేస్తారు... రెండు నెలలు చేస్తారు...

''ఎన్నాళ్ళు నీలోని నీరహస్యాన్ని ఇంట్లో దాస్తావ్... చెప్పు సుజాతా! చెప్పు... ఇది ఇంట్లో తెలిసిన నాడు మీ యింట్లో నీ స్థానమెంత?''

వీటన్నిటికీ సమాధానం సుజాత దగ్గర ఏడుపు తప్ప మరేమీలేదు.

గాగుల్స్ తీసి మరీ ఏడ్చింది.

''ఎందుకి తెలుసా?''

"ఇంకా చెప్పలేదు!"

జాలి వేసింది తనకు.

ఛ! అసలే బాధ పడుతుంటే తను మరీ బాధ పెట్టడమా?

"కోప మొచ్చిందా?"

తల అడ్డంగా ఊపింది.

తనూ తమాయించుకున్నాడు చాలా సేపు. చీకట్లో నల్లగా గుంభనగా వున్న హుస్సేన్ సాగర్‌ను చూస్తూ కూర్చున్నాడు.

ఉన్నట్టుండి, సుజాత బుజం నొక్కుతూ, "భయపడకు ... లే... చేతనయినంతవరకూ ఈ విషయాన్ని రహస్యంగా అట్టిపెట్టు.. ఇక తప్పక పోయిందా...ఏం ఫరవాలేదు... నేనున్నాను... నాకోరూంవున్నది...''

"ఊఁ.. ఉహూఁ ...మేడమ్"

లేచి నిలబడింది.

''నవ్వాలి!"

''— నన్ను చూచి జనమా?"

"కాదోయ్ పిల్లా!" "తెచ్చి పెట్టుకున్న హుషారుతో ముందుకువంగి, "నీకు అమ్మాయి కావాలా? ... అబ్బాయి కావాలా?" అడిగాడు.

"నేను ఆలోచించలేదు ... మనస్సే బాగులేదు!''

''డోన్ట్‌వర్రీ మేడమ్ ... నీకు అబ్బాయి పుడతాడు...వాడికి పేరు నా పేరు పెట్టుకో!" కళ్ళల్లోకి సూటిగా చూచాడు.

"థాంక్యూ...''

''మెన్షన్ నాట్... బీ కేర్‌ఫుల్... ఊఁ...లాఫ్... లాఫ్ ... ఫర్ మైసేక్... హస్‌నా మమ్మీ!"

* * *

ఒక్కకుదుపుతో రైలు ఆగింది.

సూట్కేసు తీసుకొని రైలు దిగుతుండగా మొట్టమొదటి సారిగా రాజు మనస్సులో ఒక ప్రశ్న ఉదయించింది.


ఆ ప్రశ్న ఇంతై, మరింతై, విశ్వమంతై అతడిని ఉక్కిరి బిక్కిరి చేయ సాగింది.

గుండెలు దడదడలాడినయి. ఒళ్ళంతా చెమట పట్టసాగింది. కాళ్ళు తడబడినయి. టికెట్టిచ్చి స్టేషన్ బయటకు రావటానికి భయం పుట్టింది.

సుజాత అంతపని చేస్తుందా?

కళ్ళు చీకట్లు క్రమ్మసాగినాయి.

ఛ! సుజాతా...నీవు...నీవు...




ఎటూ తేల్చుకోలేక పోయాడు. తల విదిలించాడు. అయోమయంగా ముందుకు నడిచాడు. గేటుదాటి బయటకు వచ్చాడు. ఓ రిక్షాలో విసురుగా కూర్చుంటూ, "ఏదైనా లాడ్జికి పోనీయ్!" అన్నాడు.

నలుగురికీ తెలిసింది సుజాత తనతో తిరిగిందనే. సుజాత తల్లికాబోవటానికి కారణం అందరూ తనే అనుకుంటే–?

కాదనేందకు ఈ నాడు మధులేడు.

ఉన్న సుజాత—

అతని సంగతి బయటపెట్టి తన భావి జీవితమంతా నిప్పుల్లో పోసుకుంటుందా? సౌఖ్యాలన్నీ త్యజిస్తుందా? కావాలని చీకటిని ఆహ్వానిస్తుందా?

'సుజాత జరిగిందంతా మర్చిపోతే—

తను ఎక్కడ? తను ఎక్కడ నిలబడగలుగుతాడు?

వెచ్చటిగాలి మొఖంమీద చాచి కొడుతున్నట్లుగా వీయసాగింది. ఆ లాడ్జిలో తలుపులు బిగించి, ఫ్యాను క్రింద కళ్ళు మూసుకొని వెల్లకిలా పడుకుంటే—తెలియని భయం గుండెలమీద ఎక్కి–కూర్చున్నది!

ఏం చేయాలి తను?

కళ్ళు మరింత గట్టిగా మూసుకున్నాడు.

సుజాత కళ్ళముందు తారట్లాడుతూంది.

జాలిగొలిపే సుజాత మొఖం తనవంక దీనంగా చూస్తోంది

'నేను రాజూ!.. సుజాతని,..నన్ను గుర్తించలేదా?'

భవిష్యత్తులో నల్లని అంధకారంలో

ఇరుక్కుపోగా గిలగిలలాడి పోతున్న సుజాతను చూడలేకపోతున్నాడు.

'రాజూ! ప్లీజ్...నేను, నీ సుజాను!'

సుజాతకు ముందు జీవితమేవిటి? మధులేడు. కొద్ది నెలల్లో అతడిద్వారా తల్లికాబోతున్న ఆమెకు మధులేడు. కడుపులోని పసిగుడ్డుకు తండ్రిలేడు.

అంతక్రితంక్షణంవరకు సుజాత అంటే భయపడ్డ అతడికి సుజాత అంటే అమితమైన జాలి కలిగింది. ఎంతో దీనావస్థలోవున్న సుజాతను ఒడ్డుకు లాగవలసిన తను—ఆమెకు భయపడి, ఈ లాడ్జిలో మూలగదిలో తలుపులు మూసుకు పడుకున్నాడు! తను అంత పిరికివాడయ్యాడా? తను అంత బలహీనుడయ్యాడా?

ఛ! ఛ!...

తను సుజాతకు ఏవిధంగానూ సహాయం చేయలేడా? తను సుజాతను ఈ సంక్షోభంనుంచి రక్షించలేడా? తను సుజాతకు ఓ మార్గం చూపలేడా? తను సుజాత జీవితంలో ఓ దీపం వెలిగించలేడా?— తను లేడా సుజాతకు!

ఆప్రశ్నల పరంపరను అతడు ఎదుర్కోలేకపోయాడు.

ఆనాడు—గాగుల్స్‌తీసి,— టాంక్ బండ్‌మీద సంతతధారగా కన్నీరు కార్చిన సుజాత కళ్ళముందు కదిలింది.

సుజాత ఎలాంటిదో తనకు తెలుసు. సుజాత మనస్సు పువ్వులా ఎంత సున్నితమో తనకు తెలుసు.

సుజాత మనస్తత్వం తెలుసు.

సుజాత తెలుసు.

'సుజీ!'

'చిన్న వయసునుండీ ఇప్పటివరకూ ఒకటిగా పెరిగిన మనలో నీకు ఈనాడు కలిగిన కష్టం నాదికాదా?—నేనులేనా?'

* * *

సుజాత జీవితంలో ఆరిపోయిన దీపాన్ని తనుగాక మరెవ్వరు వెలిగించగలరు?

అందుకోసరమే నన్నట్లుగా లేచాడు. రూం బయటకు వచ్చాడు. రిక్షాఎక్కాడు. సుజాత ఇంటిముందు దిగాడు.

''అయ్యో రాజూ! వచ్చావా నాయనా! రా... సుజాతగాని టెలిగ్రాం ఇవ్వలేదుగా?... నీవు వెళ్ళి పదిరోజులయినా కాలేదు...ఇప్పుడు వెళ్ళిచూడు...దాని మొఖం ఎలా వున్నదో... కుళ్ళికుళ్ళి ఏడుస్తోంది...పదిరోజులకే ఇలా తయారయితే—ఇక సరేలే, ముందు పైకివెళ్ళి ఎలా సముదాయించుకొంటావో సముదాయించుకో!...'' అంటూ పెద్దగానవ్వింది సుజాతతల్లి.

ఆమె ప్రవర్తనకు రాజు గతుక్కుమన్నా, అందులో అసహజమేమీ లేదనిపించింది—నిజమే వాళ్ళకదే తెలుసు!

మేడ మెట్లెక్కాడు.

''గదిలోనే వున్నదా?''



"ఆఁ హాఁ ...బయట ప్రపంచం చూడటమే మానేసింది!"

రాజు సుజాత గదిముందు నిలబడి దగ్గరకు వేసివున్న తలుపులను నెట్టాడు. లోపల సుజాతను ఎలాంటి స్థితిలో చూడవలసివస్తుందా అన్నంత భయంగా తలుపులు నెట్టాడు. తెరచుకున్న తలుపుల గుండా బితుకు బితుకు మంటూ లోపల కాలు పెట్టాడు.

"సుజా!"

సుజాత ఉలిక్కిపడి తలెత్తింది. రాజును చూస్తూనే బావురుమన్నది.

"సర్వనాశనమయిపోయింది రాజూ! నా ప్రపంచమే సర్వనాశనమయింది!"

రాజు ఒక్కడుగు వెనక్కు వేసి తలుపులు వేసేశాడు. పరుగెడుతున్నట్లుగా సుజాత మంచం దగ్గరకు వచ్చాడు.

సుజాత రెండు బుజాలను గట్టిగా పట్టుకొని, "ఏడ్వబోకు సుజా!" అన్నాడు — ఆమె మొఖం, ఆమె

కన్నీరు, ఆమె దుఃఖం అతడిని విచలి తుడిని చేస్తున్నయి.

"ఏడ్వక నన్నేం చేయమంటావ్?"

''కష్టాలందరికీ వస్తాయి...మనం ధైర్యంగా ముందడుగు వేయాలి."

"ముందు ప్రపంచమే లేనినాకు అడుగులు దేనికి? ఎక్కడికి?''

''ఛ! ఛ! నీవింత పిరికిదానివి అనుకోలేదు!"

"నేను అమితమైన ధైర్యాన్ని ప్రదర్శిస్తాను...మధు బ్రతికి వస్తాడా?" ఏడుపుతో మెలికలు తిరిగిపోతోంది.

"మధూ...మధూ...నన్నూ ఎందుకు తీసుకవెళ్ళలేదు?"

''ఎలా జరిగింది?"

''యాక్సిడెంట్...లారీ గుద్దింది... అప్పుడే... అక్కడే..."

* * *

''ఎంతసేపు ఇలా ఈగదిలో క్రుగ్గి పోతావు? లే...క్రిందకు వెళ్దాంపద...అన్నం తినవా?"

"నేను అన్నం తినగలనా?''

"నేనున్నాను...నీకేమిటి సుజా! లే...లే''

"నీవుండి ఏంలాభం...నాకష్టాలేమైనా తీర్చగలిగిన వాడవా? నా మధూను తే గలవా?"

రాజు మాట్లాడలేక పోయాడు.

సంతోషంగా చెంగుచెంగున దూకుతూ మధుతో తిరిగిన సుజాత గుర్తుకు వచ్చింది. సుజాత నవ్వులు గుర్తుకు వచ్చినయి.

సుజాతకు తన నిర్ణయాన్ని ఎలా తెలియచెప్పాలో అతనికిఅర్థంకాలేదు.

''సుజా!'' ఒక్క క్షణమాగాడు. ఆమె మొఖంలోకిచూస్తూ ఆమె వైపుకి రెండడుగులు వేశాడు. ''జరిగింది ఘోర మైన దుర్ఘటనే... నేను కాదనను.. నేనే కాదు తెలిసినవారెవ్వరూ కాదనలేరు... కాని! కాని... ఎన్నాళ్ళిలా...దుఃఖాన్ని మర్చిపోవాలి సుజా...గతాన్ని మింగివేసి భవిష్యత్తుమీద ఆశలూ ఆనందాలు నింపుకోవాలి. .రేపులో వెలుగును చూసు కునే తాపత్రయమే మనిషికి లేకపోతే మనిషికి మనుగడే లేదు!"

''నాకేదీలేదు''

"—ఎందుకులేదు? నీకు ఏదీ లేదని ఎందుకనుకోవాలి?" ఆవేశంగాముందుకు వంగాడు. "నీ ఆనందమే నా ఆనందంగా భావించే నేనులేనా? నేనూ మధులాగానే చచ్చిపోయాననుకుంటున్నావా?"

"రాజూ!"

"అవును సుజాతా! ఇందులో ఆలో చించాల్సిందేమీలేదు ... నేనున్నాను సుజాతా! నేనున్నాను...జరిగిందంతా ఒక పీడకల అనుకుంటే, ఇక మన ముందు న్నది ఒక పూలబాటే... మల్లెలబాట...! మన చేతుల్లోవున్నది సుజాతా, మన భావి జీవితం!"

"రాజూ!" ఆవేశంగా లేవబోయింది.

రెండు బుజాలమీదా చేతులువేసి నొక్కి కూర్చోపెట్టాడు.

"నేనున్నాను...నీకు నేనున్నాను... నీవు నాదానివి!''

వింతగా రాజు మొఖంలోకిచూస్తోంది. విభ్రాంతిగా రాజుమొఖంలోకి చూస్తోంది.

"నేను తల్లిని కాబోతున్నాను తెలుసా?''

''తెలుసు!''

''తెలిసే నేను నీదాన్ననుకుంటు న్నావా?"

''అవును—రాజు తీసుకున్న నిర్ణ యానికి తిరుగులేదు!"

''రాజూ! రేపుపుట్టబోయే పిల్లవాడికి తండ్రి ఎవరూ అంటే ఏమని చెబు తావు?"

''అసలు ఎవరికైనా ఎందుకు వస్తుంది అనుమానం!"

''తెల్లవారుతుంది. పొద్దుకూకుతుంది. రోజులు దొర్లిపోతుంటయి. వారాలు గడుస్తుంటయి...నెలలు మారుతుంటయి. ప్రతిక్షణం నీకళ్ళముందు నా బిడ్డడు తిరుగాడుతుంటాడు. నాబిడ్డనుచూస్తూన్న ప్రతిక్షణం నీ కళ్ళముందు మధు కన బడుతుంటాడు...ప్రతిక్షణం మేమిద్దరమే కనబడుతుంటాం — నీ మనస్సెలా వుంటుంది? నీచూపులెలా వుంటాయి? నీప్రవర్తన ఎలావుంటుంది— నీవు ఎలా బ్రతకగలుగుతావు, రాజూ?"

ఒక్క క్షణం దీక్షగా ఆగాడు. ''అదీ ఆలోచించాను ... అందుకే ఒకపని చేద్దాం!" ముందుకు వంగి ఆమె కళ్ళల్లో కళ్ళుపెట్టాడు." ఓ వారంలో మన పెళ్ళయిపోతుంది...హనీమూన్ అంటూ దేశాలమీద ఆరునెలలు తిరుగుదాం . . . ఎక్కడో దూరతీరాలలో నీ డెలివరీ అవుతుంది. . .అక్కడే ఆ పసిగుడ్డును ఏదైనా హాస్టల్లోనో. ఆశ్రమంలోనో చేర్చేద్దాం....తరువాత....తరువాత ఏమీ కానల్లే మనమీ వూరు వచ్చేస్తాం...''

సుజాత వెనక్కువాలిపోతూ, ''నీవా బిడ్డకు తండ్రివికాదు కాబట్టి ఆ సమ స్యను క్షణాల్లో విడదీయగలిగావు... కానీ, నేనాబిడ్డకు తల్లిని రాజూ!" అన్నది—కనురెప్పలు నిలబడలేనంతగా వాలిపోతున్నాయి.

"అంటే, ఆ పుట్టబోయే పసిగుడ్డు కోసరం నీజీవితాన్ని నిప్పుల్లో పోసు కుంటావన్నమాట!"

"పుట్టబోయే పసిబిడ్డే నాసర్వస్వం అవుతున్నప్పుడు !— నా సర్వస్వం కోసరం నాజీవితం ఎలా అయితేనేం?'' అన్నది సూటిగా అతడి మొఖంలోకి చూస్తూ.

''నీకు తోచిందేతప్ప మరొకరి మాట వినవన్నమాట...అంతేగాని ఓ నీడంటూ లేని ఆడది ఈ ప్రపంచంలో ఎలా బ్రతకగలుగుతుందో ఆలోచించావా?''

"జీవితం మీద నాకు ప్రేమలేదు రాజూ!...నాకు బ్రతకాలనే ఆశాలేదు!" విసురుగా అన్నది.

అసహనంగా రాజుతల అటూ ఇటూ ఊపసాగాడు.

"నీకెలా చెప్పాలి సుజా నేను!''

''రాజూ! ఒకటి చెబుతాను వింటావా! ...నేను తెలుగు మనిషిని...తెలుగు మనిషి తత్వం నాకుతెలుసు...నీవేదో నాకోసమని, నీసుజా దుఃఖంలో మునిగి పోతుంటే చూడలేక త్యాగంచేయాలను కుంటున్నావు...అది త్యాగంకాదు రాజూ! మనయిద్దరి జీవితాల్లోనూ నిప్పులుపోసు కోవటమే...ఇది పందొమ్మిది వందల డెభై మూడులో ఆంధ్రదేశంలో జరగ గలిగేపనికాదు ... వందసంవత్సరాల తరవాత నేనే ఇలాంటి పరిస్థితులలో వుంటే ఏంచేసేదాన్నో నాకయితే తెలి యదుగాని, ఈ నాడుమాత్రం ఖచ్చి తంగా చెప్పగలను—నీకు మాత్రం భార్యను కాలేను అని! నీకేకాదు రాజూ... ఎవ్వరికీకాలేను...వాళ్ళ త్యాగానికి బానిస నయి వాళ్ళచే పురుగులా చూడబడలేను ...క్షణక్షణం నాగుండెల్లో వాళ్ళచేత కత్తులతో పొడిపించుకోలేను!''

"మరి ఏంచేస్తావ్?" అన్నాడు కసి గాను, కోపంగాను, ''చెప్పు, ఏంచేస్తావో చెప్పు!"

సుజాత పేలవంగా నవ్వింది.

గొంతును మృదువుగానూ, దృఢం గానూ మార్చుకొని. "పండంటి పిల్ల వాడిని కంటాను...వాడికళ్ళల్లో మధును చూచుకుంటాను...... వాడి నడకలో మధునిచూచుకుంటాను...వాడి మాటల్లో నామధుని చూచుకుంటాను...''

''నీవు చేసిన ఈపనికి మీవాళ్ళు నిన్ను రోడ్డుమీదకు మెడపట్టి గెంటు తారు, తెలుసా?'' అసహాయంగా బెది రించాడు.

సుజాత అంత దుఃఖంలోనూహాయిగా నవ్వింది.

''మా బాబుకు మామయ్యవున్నాడు... వాళ్ళింటికే వెళితే మమ్మల్ని పువ్వుల మీద నడిపిస్తాడు!''

''ఎవరతగాడు?'' విసురుగా మీది మీదికి రాసాగాడు.

"నువ్వే...నువ్వేరాజూ!"

